

# తీర్పు ఏదో

చీర్ల సీతాదేవి —

మా అఫీసులో వాళ్ళంతా నన్ను మిస్ మీన, ఎమ్ ఏ. అంటారు. మూడేళ్ళ క్రితం నాకు 30 యేళ్ళు. ఇప్పుడు 33. ఈ మధ్య కాలంలో నేను శ్రీమతి మీనా నయ్యాను. మళ్ళీ యిప్పుడు నన్నందరూ మిస్ మీనా అనే పిలుస్తారు.

నేను బాగా పొడవుగా, సన్నగా బల హీనంగా వుంటాను. మనిషి గడకర్రలా వున్నా గొంతు మాత్రం కంచు గంటలా ఖంగుమని వుంటుంది అంటారు కొందరు.

'మొగరాయుడు. ఆ మాట, నడక చూడు. ఈమె నెవరు పెళ్ళాడతారు' నా వెనుకగా అనేకసార్లు, అనేక మంది అనుకోడం విన్నాను. విని కూడా విననట్లే వుండటానికి ప్రయత్నించేదాన్ని.

నా గురించి రకరకాలుగా అనుకునే వాళ్ళతో మనసువిప్పి ఎలా మాట్లాడగలను ? చాలా ముభావంగా వుండటం అలవాటు చేసుకున్నాను. గర్విష్టి అన్న బిరుదు తగిలించారు.

మారేడ్‌పల్లిలో హౌసింగ్ బోర్డ్ యిల్లు ఎలాట్ అయింది. ఇంట్లోకి కావలసిన ఫర్నిచరు, టివి, ఫ్రిజ్ దగ్గర నుంచి యిది లేదు అనకుండా యిన్‌స్టాల్‌మెంట్సు మీద అన్నీ కొని అమర్చాను.

'అంగట్లో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు ఎన్నుండీ ఏం లాభం? మొగుడన్నవాడు లేకపోయాక' అనేది అమ్మ.

నాతో కొద్దో, గొప్పో పరిచయం వున్నవాళ్ళు అఫీసులో స్నేహితురాళ్ళు "మీనా ! పెళ్ళిచేసుకోకుండా వృద్ధ కన్యలా వుండిపోతావా ఏమిటి ? ముసలి కాలంలో నా అనేవాళ్ళు లేకపోతే కష్టం. ఎవర్నో వొకర్ని చూసి చేసుకోమని" సలహా యిచ్చేవాళ్ళు. ఇంటికొస్తే అమ్మ గొణిగేది. ఒకోక్కసారి వాళ్ళ మాటలు విసుగు పుట్టించేవి. ఒకోక్కసారి బాధ కలిగించేవి.

నేనేమీ పెళ్ళి చేసుకోనని భీష్మించుకు కూర్చున్నానా ? రూపం లేకపోయినా - స్త్రీ సహజమైన కోరికలూ, వాంఛలూ నాలోనూ వున్నాయి.

'రూపం', శాపం కొందరి పాలిట అయితే - ఆ రూపం లేకపోవడమే నా పాలిట శాపంగా మారింది. మొగవాడిని అకర్షించే శరీరం, రూపం నాకు లేవు మరి. నన్ను నన్నుగా అర్థంచేసుకోగల తోడు కావాలని నాకూ వుంది

అమ్మ తన ప్రయత్నాలు తను సాగిస్తూనే వుంది. ఓ రోజు ప్రకాశం వచ్చాడు, పెద్ద పెట్టె, బెడ్డింగుతో సహా. ప్రకాశం అంటే ఎవరో కాదు. స్వయానా మా అమ్మకి తమ్ముడు.

ఆ రోజు నేను యింట్లోనే వున్నాను.

"ఆర్మీనుంచి వచ్చేశాను చిన్నక్కా ! తిన్నగా మనవూరు వెళ్ళాను. అమ్మ క్రిందటేడు పోయిందట. నాకు తెలీదు. మీరంతా ఎవరి కాపురాలు వాళ్ళు చేసుకుంటున్నారు. ఒక్కడ్నీ ఆ పల్లెటూర్లో వుండి యేం చేయను చెప్పు. వ్యవసాయం చేతకాదాయె. అందుకని నా పేరనున్న రెండకరాలు అమ్మేసి ఆ డబ్బు జేబులో వేసుకుని యిలా వచ్చేశాను. మీనా హైదరాబాదులో యేదో పెద్ద వుద్యోగం చేస్తున్నది, మంచి పలుకుబడి కూడా వుంది అని అక్కడంతా చెప్పారు. చిన్నక్కా ! మీనాకి చెప్పి యేదైనా ఉద్యోగం వేయించావంటే మీ పేరు చెప్పుకుని బ్రతికిపోతాను," అనడం ప్రక్కగదిలో వుండి విన్నాను.

అతను స్నానానికి వెళ్ళినప్పుడు అమ్మ, నాతో రహస్యంగా "ప్రకాశం చాలా మారాడు" అంది.

ఆమె అలా అనుకోడానికి కారణం -

ప్రకాశం చిన్నప్పుడు అల్లరిచిల్లరగా తిరిగేవాడు. చదువు సరిగ్గా అబ్బలేదు. 20 యేళ్ళకు యెలాగో మెట్రిక్ పాస యాననిపించి వోరోజు తాతయ్య కోప్పడి నందుకు యిట్లోనుంచి పారిపోయాడు నలుగు రాడపిల్లల తరువాత కొడుకని గారంచేసి పెంచిన అమ్మమ్మ దిగులు పెట్టుకుంది. కొడుకుని తనలా రైతుని కాకుండా ఉద్యోగస్తుణ్ని చేయాలని వుబలాటపడ్డ తాతయ్య నెత్తిబాదుకుని చివరికి 'ఎక్కడికి పోతాడులే వెధవ! కడుపు మాడితే వాడే తిరిగొస్తాడు' అని తను ధైర్యం చెప్పుకుని యిల్లాలికి ధైర్యం చెప్పాడు.

ఏడాది తరువాత ప్రకాశం తను ఆర్మీలో చేరిపోయినట్లు తండ్రికి జాబు వ్రాశాడు. ఆ సంవత్సరమే తాతయ్య పొలంలో పనిచేస్తూ పాముకాటుతో మరణించాడు

ఆ ప్రకాశం పదిహేనేళ్ళ తరువాత యిలా కనబడేసరికి 'వీడు బుద్ధిమంతు డయ్యాడు.' అని అమ్మ అనుకోడంలో అతిశయోక్తి లేదు.

అతనొచ్చి అప్పుడే నెల గడిచింది.

ఓ పెలవురోజు - తీరిగ్గా పేపరు చదువుతుండగా అమ్మ ప్రక్కన వచ్చి కూర్చుంది.

"ప్రకాశం ఇకసైన్యంలోకి వెళ్ళడట. ఖండితంగా చెప్పేశాడు" అన్నది.

"ఊఁ" అన్నాను.


"మనిషి పుష్టిగా, ఆరోగ్యంగా తయారయ్యాడు," అన్నది. విని వూరు కున్నాను.

"చదు వొక్కటేగా తక్కువ. దొరికితే ఉద్యోగం చేస్తానంటున్నాడు. ఏదో వొకటి చూసిపెట్టు. నువ్వు మరో యింటికి పోనక్కరలేదు. నీ యింట్లోనే అతను పడుంటాడు. మునుపటిలా కాదు. బుద్ధిమంతుడయ్యాడు" అన్నది. ఎంత సేపటికీ నేనేమీ అనకపోడం చూసి —

"ప్రకాశాన్ని అడిగి చూశాను. నువ్వు యిష్టపడితే తన కభ్యంతరం లేదన్నాడు," అన్నది మళ్ళీ.

అమ్మ ముఖంలోకి ఒకసారి చూచి ఆలోచనలో పడ్డాను. వారం రోజుల తరువాత, నేను సరే నన్నాక, పెళ్ళి చాలా సింపిల్‌గా జరిగిపోయింది. అతని ప్రవర్తన చాలా చిత్రంగా వుండేది. అతి ఒబీడియస్ట్ స్టూడెంటులా, హంబుల్ సర్వెంటులా ప్రవర్తించేవాడు. అడుగడుగునా అతనిలో తొంగి చూచే ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ చికాకు పుట్టించేది.

నేను విసుకున్నా, కసురుకున్నా అతను కిమ్మనకుండా వుండిపోడం, నేను చెప్పినవన్నీ తూచా తప్పకుండా ఆచరణలో పెట్టడం చూస్తూంటే అతని పట్ల గౌరవానికి బదులుగా చులకన భావం, విరసన నాలో కలిగేవి. అంతే కాదు. అతను నాతో కబుర్లు చెప




తున్నప్పుడు, మెల్లగా నా ప్రక్కన చేరినప్పుడూ - అతను ప్రదర్శిస్తున్న దంతా నిజమైన ప్రేమా లేక నటనా అన్న ప్రశ్న నాలో కలిగేది.

ఆ ఆలోచన రాగానే అతనితో ఫ్రీగా మూవ్ కాలేకపోయేదాన్ని.

ఇవన్నీ కలిసి అతన్ని ప్రేమించేలా- గౌరవించేలా చేయలేదు.

రాజీపడలేక పోయేదాన్ని.

ఇలా యేడాది గడిచింది.

అతనేదీ తనంతట తానుగా నేరుగా నన్ను అడిగేవాడు కాదు. మా మధ్య అమ్మ రాయభారి. "నువ్వు ఆఫీసుకి వెళ్ళిపోతే అతను కాళీగా యింట్లో కూర్చుంటున్నాడు. ఏమీ తోచక సినిమాకు వెళ్ళొస్తానంటే మీనాకి సినిమాలు చూడ్డం అంటే గిట్టదు అన్నానని మానుకున్నాడు. సినిమా బొమ్మల పుస్తకాలు ఇంటికి తేవద్దంటే మానుకున్నాడు. పాపం ఆ రేడియో వింటూ ఎంత సేపని కూర్చుంటాడు. ఏదో వో ఉద్యోగం చూసిపెట్టు." అంది అమ్మ వో రోజు.

"తిని పడుకుని నిద్రపోకపోతే టైపు, షార్టుహేండు నేర్చుకోమను. అతను

చదివిన చదువుకి ఉద్యోగం దొరకమంటే దొరకదు." అన్నాను విసుగ్గా.

అతనిలో అంత పట్టుదల, తెలివి తేటలూ వొక్కసారిగా యెలా వచ్చాయో గాని రెండేళ్ళలో పైపు లోయరు, హైయ్యరు షార్టుహేండు పాసయ్యాడు. మరో రెండు నెలల్లో ఏదో ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం కూడా సంపాదించాడు.

మొదటి జీతం అందుకున్నాడు గామాలు పాపకి గౌన్లు, నాకు చీర తెచ్చాడు.

నాకు చీరలు అంటే అంత మోజు లేదు.

కొనడానికి వెళ్ళినప్పుడు కూడా చాలా మంది ఆడవాళ్ళలా గంటల తరబడి ఒక చీర కోసం వెదకను. లైట్ కలర్ ప్రింటుదో, చిన్న అంచున్న సాదారంగు చీరో తీసుకుని బయటపడతాను అతను తెచ్చిన చీర విషయంలో పెద్ద కుతూహలం కనబరచలేక పోయాను. అత నందించిన పేకెట్ టేబులు మీద పడేసి వంటింట్లోకి వెళ్ళాను. నేను తిరిగొచ్చే సరికి అతనక్కడ లేడు. ఆ రాత్రి యింటికి రాలేదు.

మరుసటి రోజు రాలేదు.

నెల్లాళ్ళ తరువాత లోకల్‌లో వచ్చింది ఉత్తరం. అందులో ఎప్పటికీ నేను మరువలేని వాక్యాలు....

"నీ కన్నా నేను వొక యించి కురుస కావచ్చు. నీకన్నా ఐదువందలు తక్కువ సంపాదించవచ్చు. నీలా పోస్టు గ్రాడ్యు వేటుని కాకపోవచ్చు. కానీ, మీనా! నేను నీ భర్తని.

నీకన్నా అన్ని విధాలా తక్కువ వాడిననే చులకన భావం నీలో వుంది. ఆ సుపీరియారిటీ కాంప్లెక్సుతోనే నువ్వు నన్ను భర్తగా అంగీకరించలేక పోయావు. చివరికి నీ ప్రక్కన చేరిన క్షణాలలో కూడా.... మగవాడు కోరుకునేది ఆడదాని సంపాదన కాదు మీనా! తన యింట్లోనే తనకి గుర్తింపు, గౌరవం దొరకకపోతే యే మగాడూ సహించలేడు. అందుకు కారణం అతని అణువణువునా జీర్ణించుకుపోయిన మగవాడి నన్న అహం.

"మీనా! ప్రమీల నన్ను గౌరవిస్తుంది. ఆరాధిస్తోంది. నేను ఆమె కళ్ళల్లోకి చూడగానే నీ కళ్ళల్లా ఆమె కళ్ళు ఎరుపెక్కవు ఈసడింపుగా నన్ను చూడవు. సూటిగా నావైపు చూడలేక అవి రెపరెపలాడి వాలిపోతాయి.

"నన్ను మొగవాడిగా గుర్తించే ఆడది కావాలి నాకు. ఇద్దరం పెళ్ళిచేసుకో బోతున్నాం.

"కోర్టుద్వారా మనం విడిపోడం నీకూ, నాకూ క్షేమం. ఆ యేర్పాట్లు త్వరలోనే చేస్తావా. నువ్వు తెలివైన దానివి. కాదనవని అనుకుంటాను. మీనా



యింకో విషయం. నేను ప్రమీల యింటికి వెళ్ళడం లేదు. ప్రమీలే నేను అద్దెకు తీసుకున్న యింట్లోకి రాబోతోంది. ఆ యింటికి నేను యజమానిని. ప్రమీల నా భార్య.

వుంటాను. ప్రకాశం.

అమ్మ - నాకు దగ్గర స్నేహితులూ నాదే తప్పంటారు. ఏమో మరి?

ఎవరి తప్పు వాళ్ళకి తప్పుగా తోచవుగా!

పోనీ మీరు చెప్పండి!

———